# చిగురించని ప్రేమ

## శ్రీనివాసరావు తోట

### మొదటి కథ

నేనో మధ్యతరగతి అమ్మాయిని. సంఘం, సాంప్రదాయాలు గీసిన గీతను దాటి వెళ్లి సాహసం చెయ్యలేనిదాన్ని. మౌనంగా, మందాకినిలా సాగిపోతున్న నా జీవితం వాసు పరిచయంతో గలగలపారే సెలయేరులా మారింది. నేను బి.ఎస్‌సి. సెకండ్ ఇయర్‌లో వున్నప్పుడు అతను మా క్లాస్‌లో జాయినయ్యాడు. వాళ్ల నాన్నగారు బ్యాంక్‌లో మేనేజరట. ట్రాన్స్‌ఫర్‌పై ఈ ఊరు వచ్చారు. అలా తను డిగ్రీ సెకండ్ ఇయర్‌లో క్లాసులు ప్రారంభమయిన కొద్దిరోజులకు మా కాలేజ్‌లో చేరాడు. క్లాసులో ఎప్పుడూ మౌనంగా, దేన్ని గురించో ఆలోచిస్తూ కనిపించే అతనికి మా క్లాస్‌లోని అమ్మాయిలు కొందరు షేక్స్పియర్ అనే నిక్ నేమ్ తగిలించారు.



ఒక రోజు మా క్లాస్‌లోని బాయ్స్ కొందరు "డియర్ ఫ్రెండ్స్ ఈ సంవత్సరం మన క్లాస్ వాళ్లు ఊటీకి టూర్ వెళ్లాలని నిర్ణయించాం" అంటూ ప్రపోజ్ చేశారు. దానికి అందరం ఓ.కే. అన్నాం. ఎట్టకేలకు మా లెక్చరర్స్‌ని, ప్రిన్సిపాల్‌నీ ఒప్పించి, టూర్ ప్రోగ్రామ్‌ని ఫిక్స్ చేసాం. కాని చివరకు టూర్‌కి వెళ్లటానికి సిద్ధపడినవాళ్లం ఇరవైమందిమే తేలాం. ఈ టూర్ ఫిక్సయిన దగ్గర్నుంచి యాక్టివ్ పార్ట్ తీసుకున్నది వాసూయే. ప్రయాణం ప్రారంభమైంది.

ఊటీ కొండలపైకి బస్ ప్రయాణిస్తున్నంతసేపు, ఆ ప్రకృతి అందాలకు నా మనసు మధురమైన ఊహల్లో తేలిపోయేది. నీలగిరి ఉడ్ ల్యాండ్స్ హోటల్‌లో అందరికీ రూమ్స్ ఏర్పాటు చేసారు. స్నానాలు, టిఫిన్స్ ముగించుకుని అందరం ఉత్సాహంగా బొటానికల్ గార్డెన్ చేరుకున్నాం. నిజంగా ఆ తోటలో విహరిస్తుంటే స్వర్గంలో విహరించినట్లుంది. ఎన్ని రంగుల పూలు! నిజంగా అద్భుతం. వాసూ ఊటీ గార్డెన్స్‌పై 'విరుల సిరుల పరిమళం' అని ఒక

కవితరాసి వినిపించాడు.

రంగురంగుల పూలు రకరకాల పూలు
ఆ తోటలో ప్రతిబాటలో
అడుగిడిన ప్రతి బాటసారిని
ఆప్యాయంగా
ఆహ్వానించే
వేల అందాల సుమ సుగంధాల
అందమైన పూలు వేలవేలు
ఎండ వెన్నెల్లో ఎన్నో వన్నెల్లో
నా మనసు దోచుకున్న ఎన్ని పూలకన్నెలో!

కవిత విన్నాక అనుకున్నాను... అతనిలో ఒక మంచి కవి దాగివున్నాడని.

"వాసూ! నీ కవిత బాగుంది" అని మెచ్చుకున్నాను. అతని ముఖం ఆకుపచ్చని తోటలా మెరిసిపోయింది. ఆ తరువాత చిల్డ్రెన్ పార్క్, మినీ ట్రెయిన్, బోట్‌హౌస్‌లకు వెళ్లాం. అవన్నీ ఏఏ సినిమాల్లో చూపించారో ఉత్సాహంతో చెప్పుకుంటూపోయాడు వాసు. అతని జ్ఞాపక శక్తికి నేను ఆశ్చర్యపోయాను. నిజమే! ఊటీలోని ఆ పరిసరాలను చూస్తుంటే ఎక్కడో ఎప్పుడో చూసిన సుందర దృశ్యాలు గుర్తుకువచ్చాయి.

ఆ రాత్రి రూమ్‌లో రెస్ట్ తీసుకుని మరుసటి రోజు ఉదయం దొడ్డబెట్ట శిఖరానికి బయలుదేరాం. అది ఊటీకి పది కిలోమీటర్ల దూరంలో ఉంది. నీలగిరి అందాలను ఏమని వర్ణించాలి? తూర్పు పశ్చిమ కనుమల సంధ్యలో అద్భుతమైన సోయగాలతో నయనాలకు ఆకుపచ్చ కాటుకలద్దాయ్ ఆ ప్రకృతి అందాలు. ఆ తరువాత ఊటీ, మైసూర్ రహదారిలో 13 కిలోమీటర్ల దూరంలో 'కలహట్టి జలపాతం' వుంది. అది 100 అడుగుల ఎత్తునుండి ప్రవహిస్తోంది. సుందరమైన వనం మధ్య రంగుల పక్షులతో పులకరించే ప్రకృతి మధ్య ఎగసిపడే జలపాతాన్ని పరికించినపుడు నా గుండె లయతప్పింది. కళ్లు కలువపువ్వులయ్యాయ్. ఈ ఊటీ ప్రయాణంలో నాకు, వాసుకీ మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆ మరుసటిరోజే ఊటీ నుంచి తిరుగు ప్రయాణం. నాకైతే స్వర్గం నుంచి బయలుదేరినట్లుంది. ఒకరోజు వాసు ఊటీలో తను తీసిన ఫొటోల ఆల్బం చూడమని నా చేతికిచ్చాడు. పేజీలను తిరగేస్తుంటే ఊటీ మధుర స్మృతులు మళ్లీ మదిలోకొచ్చాయ్. సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్ అయిపోయాయి. అందరం మంచి మార్కులతో పాసయ్యాం. ఫైనలియర్ క్లాసులు ప్రారంభమయ్యాయ్. ఒక రోజు వాసు నాకో కవర్ అందిస్తూ ఈ లెటర్ చదివి నీ అభిప్రాయం చెప్పు, ప్లీజ్" అంటూ వడివడిగా వెళ్లిపోయాడు. అమ్మాయికి ప్రేమలేఖను అందించగలిగే స్థాయికి ఎదిగిన అతని చొరవకు నేను ఆశ్చర్యపోయాను. కాని కోపం రాలేదు. ఎందుకంటే నా మనసులో ఏ మూలనో అతనిపై కొంత ఇష్టం లేకపోలేదు. ప్రేమలేఖలోనూ వాసు కవిత్వాన్ని రంగరించాడు.

మైడియర్ పద్మిని!

క్లాస్‌రూమ్‌లో నిన్ను మొదటిసారి చూసిన క్షణంలోనే నీవైపు ఆకర్షించుకున్నావ్. నీ రూపం నా హృదిలో ప్రేమదీపం వెలిగించింది. నిన్ను చూసిన ప్రతిరోజూ నాకు వసంతమే.

ఆవారా జీవితంలో ఆశలెన్నో రేకెత్తించావు. నిదురించిన ఉత్సాహాన్ని ఎగసిపడేలా నిద్ర లేపావ్. వర్ణించలేని తియ్యటి ఊహలలోకంలో నిత్యం విహరించేలా చేసావ్. నాలో ఇన్ని ఆనందాలు, అనుభూతులు సృష్టించిన ఓ ప్రేయసీ 'ఐ లవ్ యూ'.

మన చదువు పూర్తయ్యాక నిన్ను పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను. మరి నీ మనసులో ఏముందో తెలియపరుస్తావని ఆశిస్తూ...

నీ ప్రేమపిపాసి
వాసు

ఆ లేఖ చదివిన నాలో నిదురించిన రాగాలు మేల్కొన్నాయ్. ఏదో రంగుల ఊహల లోకంలోకి నామనసు రెక్కలు విప్పుకుని రివ్వున ఎగిరిపోయింది. నా నిస్తేజ హృదయంలో కాంతి కిరణాలు మెరిశాయ్. ఇంతలోనే ఓ విషాద మేఘం కమ్ముకొచ్చింది. నా ప్రేమ ఫలించదు అనిపించింది. అందుకే నా ప్రేమను వాసుకి తెలియపర్చకూడదనుకున్నాను. ఎందుకంటే నా ప్రేమ విషయం మా అమ్మనాన్నలతో మాట్లాడే ధైర్యం నాకు లేదు. మా పెళ్లికి మా అమ్మనాన్న ఒప్పుకోరు. మా అమ్మ నన్ను తన తమ్ముడికిచ్చి పెళ్లిచెయ్యాలని నిర్ణయించింది. ఆ సంబంధం మా నాన్నకూ ఇష్టమే. అందుకే ఫలించని ప్రేమ గురించి ఎందుకు వాసులో ఆశలు రేపడం అనిపించింది. కాలం పరుగులు తీసింది. మూడవ సంవత్సరమూ అయిపోవచ్చింది. నేను మునుపటిలాగా ఉత్సాహంగా లేను. ఒక రోజు కాలేజ్ నుంచి ఇంటికి బయలుదేరిన నాకు హఠాత్తుగా వాసు ఎదురయ్యాడు.

పద్మినీ! నా ప్రేమలేఖకు నువ్వు బదులివ్వలేదు అన్నాడు.

"నా వివాహం నిశ్చయమైంది. మన ఈ ప్రేమ వివాహానికి మా అమ్మనాన్నలు ఒప్పుకోరు" అన్నాను. నా కళ్లలో సన్నని నీటిపొర.

"నేను మన ప్రేమ గురించి మా అమ్మకు చెప్పాను. ఆమె మా నాన్నను కూడా ఒప్పించింది. పెళ్లయ్యాక మనం పైచదువులు చదవాలనుకుంటే చదివించటానికీ మా వాళ్లు ఒప్పుకున్నారు" అంటూ ఆశగా పలికాడు వాసు.

"కాని నా తల్లితండ్రులు ఒప్పుకోవటంలేదు కదా?" నిరాశగా పలికాను.

"నా మీద నీకు ప్రేముంటే మీ తల్లితండ్రులను వదిలి నాతో రాలేవా?" ప్రశ్నించాడు వాసు.

"అది అసాధ్యం. రెండు సంవత్సరాల ప్రేమ మనది. ఎన్నో సంవత్సరాల బంధం అమ్మనాన్నలది. నాన్నకు నేనంటే చాలా ఇష్టం. నన్ను లాలనగా దగ్గరకు తీసుకుని, ప్రేమగా మాట్లాడే నాన్న నేనిలా చేస్తే భరించగలడా? మా వాళ్లను దుఃఖసాగరంలో ముంచి నీతో ఏడడుగులూ నడవలేను. నా చెల్లి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టలేను. ఐయామ్ సారీ వాసూ! ఈ ప్రేమ కథని ఇంతటితో ముగిద్దాం" స్థిరంగా పలికాను.

"పద్మినీ! ఇంత నిర్దయగా ఎలా మాట్లాడగలుగుతున్నావ్? నిన్ను మరచిపోవటం నాకు సాధ్యమేనా?" ఆవేశంగా అన్నాడు వాసు.

"ప్రయత్నిస్తే అన్నీ సాధ్యమే. ప్రేమవల్ల మనకు సంతోషాలు లభించాలే కాని లేనిపోని సమస్యలు, ఆవేదనలూ కలుగకూడదు. నువ్వు కవివి. అన్నీ గ్రహించగలవు. ప్రేమ విఫలమయ్యిందని చదువుని నిర్లక్ష్యం చెయ్యవద్దు. పిచ్చి పిచ్చి అలవాట్లకు లోనుకావద్దు. ఇదే నేను నీ నుంచి ఆశించేది. మన కలయిక, ఈ స్నేహం జస్ట్ ఒక యాక్సిడెంట్. బి ప్రాక్టికల్ వాసు" అంటూ అక్కడి నుంచి వెనుదిరిగాను.

వాసు చిత్తరువులా, విషాద వదనంతో అక్కడే నిలబడిపోయాడు. కాని, నాకు తెలుసు నా మాటలు వాసుపై ఖచ్చితంగా పనిచేస్తాయని. మరి ఆక్రోశించే నా మనసుకు స్వాంతన కలిగించే మాటలు చెప్పేవారు ఎవరు??? ●